స్వరూప సందర్శనము

ఆర్. రంగనాథశాస్త్రి

ఆదంపతు లిర్వురును ముస్తాబై చేరియొకగదినుండియు సావడిలోనికి వచ్చిరి. అప్పుడు భార్యను చూచి భర్త యిట్లనెను:

ఎక్కడికి మీరు?

భార్య: మీరెక్కడికి?

భర్త: నేను టెన్నీసుకు.

భార్య: నేను బాడ్మింటనుకు.

భర్త: అయితే యీ రాత్రికి భోజనం-

భార్య: నావంతు కాదే - మీవంతు.

భర్త: నిజమే. నేను బాగా వంటచేయజాలను. ఒకస్నేహితుని భోజనమునకు పిలిచినాను. ఈపూట నీవు వంట చేస్తే బాగుంటుంది. నేను ఎల్లుండి, ఆవలెల్లుండి మధ్యాహ్నముకూడ వంట చేస్తాను.

భార్య: నాకేంపనీ? ఆతడు మీస్నేహితుడుగాని నా స్నేహితుడుగాడు. నాప్రోగ్రాము మారుటకు వీలు లేదు.

భర్త: నాప్రోగ్రా మంతకంటెను మారదు. కాని, పెద్దమనిషిని భోజనానికి పిలిచి ఇద్దరము తలుపు తాళంవేసి వెళ్లితే బాగుండదు.

భార్య: అవును. అందుకనే మిమ్ము వంటచెయ్యమన్నది. కాదంటారా, హోటలుకు పోయి భోజనము పట్టించుకురండి (అనుచు బయలుదేరును.)

భర్త: ఆగు. ముందీసమస్య తేల్చి మరీ వెళ్లు.

భార్య: తేల్చడానికేమున్నది? మీ యిష్టం మీది; నా యిష్టం నాది ఏమైనాసరే-ఈపూట భోజనభంగము లేనివిధమున రాజీ కుదరదా?

విషయమున నాకణుమాత్రమైనను జోక్యములేదు. నేను క్లబ్బుకు పోకతీరదు. నాస్వేచ్ఛను నేను చంపుకోను. నాస్వేచ్ఛను అరికట్టచూచుట మీకును మంచిదికాదు.

భర్త: నిజము. నీవు చెప్పినమాటలు నిజము. క్లబ్బుకు పోయి త్వరగా రా.

భార్య: ఎనిమిదిగంటలు కొట్టేకొట్టకముందే తిరిగివస్తా; కాని యీరాత్రికి కనీసము రెండువేపుడు కూర లుండవలె సుమా! లేకంటే నాకు ముద్ద గొంతు దిగదు. (చిరునవ్వు)

భర్త: వేయించడం గియించడం నాచేతగాదు. ఏదో చేతనైనట్లు చేస్తా. కూర లున్నవా?

భార్య: నన్నడుగుతారేమిటి? మధ్యాహ్నము వంటచేసింది మీరేగా, చూడండీ - లేకపోతే బజారుకు పోయి తీసుకురండి (అనుచు బయలుదేరును.)

భర్త: కాదు - నీవు ఇంట్లోనుండి వంటచెయ్యి. నేను వెచ్చాలు పట్టించుకుని వస్తా; నేను క్లబ్బుకుపోను నాప్రోగ్రామును మార్చుకున్నా. యోచించు. నీవు కూడ మార్చుకో.

భార్య: యోచనాలేదు, గీచనాలేదు. నాప్రోగ్రాము మార వీలులేదు, మార్చుకోను. తర్వాత మీయిష్టం.

భర్త: ఇంత, పెంకెతనమా?

భార్య: ఇంత మొండిపట్టా?

భర్త: మనఇర్వుర సమానప్రతిపత్తి! స్వేచ్ఛకు

భార్య: కుదరకేమి? కాని మన ఇద్దర స్వేచ్ఛా నిరతికి భంగము కలుగకూడదు.

భర్త: అయితే విను. మనమిద్దరము క్లబ్బు ప్రయాణం మానుకుందాము. నీవు వెచ్చాలకు చీటి వ్రాసి ఇవ్వు. దానిప్రకారం నేను వెచ్చాలు తీసికొని వస్తాను. నీవు వంటవండు, నేను పైపనులు చేస్తా.

భార్య: కాదు. కాదు. నేను పైపనులుచూస్తా. మీరు వంటచెయ్యండి.

భర్త: సరే. కాగితము దీసుకో. కావలసిన వస్తువులపేర్లు వ్రాయి.

భార్య: (కాగితము పెన్సలు దీసికొని) చెప్పండి వ్రాస్తా.

భర్త: ముందు నీవు పద్దులువ్రాస్తే నేను లోటు పాట్లు చెప్పుతా.

భార్య: (కావలసిన వస్తువులు చీటిమీద వ్రాసి) వ్రాశానండీ వెచ్చాలు. వారమురోజులకు సరిపోవును. మీ ఇష్టమువచ్చిన కూరలు రెండు కొనుక్కొని రండి. ఎంతఖరీదైనా సరే కాకరకాయలుంటే తీసుకురండి.

భర్త: సరే. ఇంక ప్రోగ్రాము వ్రాయండి. అన్నం వండడము నేను. పైపనులు చేయడం మీరు. పొయి ముట్టించడము కూడ మీరేసుమా!

భార్య: కాదు కాదు, అన్నంవండువాళ్లే పొయి ముట్టించడము.

భర్త: కాదండీ; పైపనులు చేసేవాళ్లే పొయి ముట్టిస్తారు. కాబట్టి ఆపని మీవంతు.

భార్య: ఏమండోయి, బాగున్నదే పొగ నాకండ్లలోకా? వంట వండడము మీరా? రాజీకు-దు-ర-దు, కుదుర వీలులేదు.

భర్త: సరే. నేనే ముట్టిస్తా; మీ కంగీకారమేనా?

భార్య: ఆఁ. అంగీకారమే.

భర్త: సాపాట్లో భోజనము. విస్తళ్లు, పీటలు వేయడం మీవంతు. అన్నము మొదలగునవి పెట్టుట నావంతు. కాని ఒక్కమాట. మేమిద్దరముగూర్చుంటే మీరు నెయ్యిమొదలగునవి వేయవలయు సుమా? మేము లేచీలేవకముందే మీరు తినవచ్చు.

భార్య: నేను వంటకత్తెనా యేమి?

భర్త: అయితే నేను వంటవాడినా?

భార్య: మీరూకాదు, నేనూకాదు. అందుకనే ముగ్గుర మొక్కమారు తిందాం. అంతేకాని నేను వెనుక భోజనము చేయను. తర్వాత మీయిష్టం.

భర్త: అయితే నేను చెప్పినట్లుచెయ్యి. స్నేహితునకు కాళ్లుకడుక్కోటానికి నీళ్లుఇవ్వడం మీవంతు. కాళ్లుచేతులు తుడుచుకోటానికి తొల్లాగుడ్డ యివ్వడం నావంతు. తర్వాత మూడువిస్తళ్లు ముక్కోణాకారముగవేసి అన్నము మొదలగునవి పెట్టి స్నేహితుని కూర్చో మంటాను. తర్వాత నేనుకూర్చుంటాను. ఆతను కూర్చో మంటే మీరు కూర్చోండి. లేదా? మాకు నెయ్యివేసి మీరు కూర్చోవచ్చు. సరిగా యున్నదా?

భార్య: సకీలేదు బేసీలేదు నేను ముందుగూర్చుంటా. తర్వాత మీ స్నేహితుడు మిమ్మ కూర్చోమంటాడు. ఇది సరియగుపద్ధతి.

భర్త: ముగ్గురమొక్కమారు గూర్చుండిన బాగుండదే. ఆతడు భోజనమున కుపక్రమించినతర్వాత మనమిద్దరము కూర్చుంటే?

భార్య: అది మరీబాగుండదు.

భర్త: అయితే మార్గం?

భార్య: మార్గ మేమిటి? ఏమైనాసరే. ఇక రాజీ కుదురదు. నాస్వేచ్ఛను, సమాన ప్రతిపత్తిని నేను గోల్పోను.

భర్త: మీరు గోల్పోవద్దు నే నంతకంటెను గోల్పోను. అతిథిసత్కారము గృహస్థధర్మము కాదా? కాపాడవద్దా?

భార్య: నే నన్నానా, తప్పక కాపాడవలసినదే. కాని నేను వంటమనిషిలాగ మీకు వడ్డించి చివరకు భుజింపను. రాజీమార్గము సూచిస్తా వినండి. ముగ్గురి మధ్యను వంటపదార్థములు పెట్టుకొని ముగ్గురము గూర్చుండి యెవరికి కావలసినవి వాళ్లు వేసుకుందాం. అంగీకారమేనా? సరిగా యున్నదా?

భర్త: సరే. అంగీకారమే. కాని, అప్పుడు మనము స్వేచ్ఛాతర్కమున తగుల్కొనగూడదు సుమా! ముందు మీరిద్దరు కూర్చొండి. నేనువడ్డించి నిలుచుంటే ఆతడే నన్ను కూర్చోమంటాడు. అంతటితోటి యీ సమస్య పరిష్కార మౌతుంది.

భార్య: బాగున్నది. ముందుగానే స్వేచ్ఛానిరతుల మని యాయనకు జెప్పిన మన కేవిధమగు చిక్కుండదు.

భర్త: సరే. మంచియుపాయమే. నీవుచెప్పు.

భార్య: నన్ను పరిచయం చేస్తే ముందుగా నేనే చెబుతా.

భర్త: ఇక యిబ్బందిలేదు. ఈమె నాభార్య యం. ఏ. యల్. టి. అని పరిచయముచేస్తా.

భార్య: ఛీ ఛీ. ఛీ. (చెవులు మూసికొని) ఏం మాట లవి?

భర్త: ఛా-ఛా-ఏమంటావు? నే నేమన్నాను?

భార్య: (మండిపడుచు) ఏమిటి మీరన్నది? భార్య! దుర్భరము. ఛీ. భరించువాడు—అట్లు పరిచయముచేయుట నాస్వేచ్ఛానిరతికి భంగము. నాకు వ్యక్తిత్వము లేదన్నమాట. మీకు దాసురాలనన్నమాట. కర్ణకఠోరము. నేను మీకుదాసినా? కాదు. ముమ్మాటికి కాదు. ఇప్పటినుండి సరిగ్గా తెలిసికొని మాట్లాడండి. మీరు నాకు భర్తకాదు. నేనుమీకుభార్యనుగాను.

భర్త: ఏమంటావు? మనలో మామూలుగా భార్యాభర్తలంటారుగనుక అన్నా. అంతే. యోచించి యన్నది కాదు. క్షమించు. కోపమెందుకు?

భార్య: కోపమా — ఎందుకా— క్షమాలేదు గిమాలేదు. చాల్పాలు. మీస్వేచ్ఛా సాధన—

భర్త: అయితే, మార్గం? నాకేమీ తోచలేదు. చెప్పండి. మీరు చెప్పినట్లే చెప్పి పరిచయంచేస్తా.

భార్య: ఫ్రెండని చెప్పండి. స్నేహితులలో ఎచ్చుతగ్గులులేవు. సర్వవిషయముల సమానులు. ఇప్పటికైనా మీకు తెలిసిందా?

భర్త: ఆ, తెలిసింది. అటులనే పరిచయంచేస్తా. మీబుద్ధి యద్వితీయం. స్వేచ్ఛానిరతి నిరుపమానం కావుననే ఒక్క మహాసత్యము మీకు స్ఫురించినది. నాకు చక్కని రాజమార్గమును చూపించితిరి. ఒక్క మాట. కలయందైనను మీ స్వేచ్ఛానిరతికి భంగము గలిగింపనని నమ్మిన సంతసింతును. మన మిద్దరము ఫ్రెండ్సు (స్నేహితులము) కాని భార్యాభర్తలముకాము. జయము, స్వేచ్ఛావాదమునకు జయము.

* * *

సరిగ ఎనిమిది గంటలకు శ్యామరావు వచ్చెను. శివరావాతని సుమ్ముఖముకడ నెదుర్కొని గదిలోనికి దీసికొనిపోయి కుర్చీమీద గూర్చుండబెట్టి మరియొక కుర్చీమీద తాను గూర్చుండెను. పరస్పర కుశలప్రశ్నల అనంతరము శివరావు మరియొక గదిలోని కరిగి, మహాలక్ష్మిని వెంటనిడుకొని వచ్చెను. ఆమె శ్యామరావునకు నమస్కరింప, అతడును లేచి ప్రతినమస్కార మొనర్చెను. ఇర్వురును చెరి యొక యాసనము నలంకరించిరి. అప్పుడు శివరావు శ్యామరావుకేసి చూచి "ఈమె నా ఫ్రెండు. పేరు మహాలక్ష్మి. యం. ఏ. యల్. టి." అని చెప్పి, మహాలక్ష్మివైపు తిరిగి, "ఈతడు నాబాల్య స్నేహితుడు. పేరు శ్యామరావు. బి. ఏ. బి. యల్. బొంబాయియందు నివాసము. ఒక్కవత్సరము సెలవు మీద ఇటకు వచ్చినాడు. పరశువాకమందు మకాము." అని భార్యకు చెప్పి మరియొక కుర్చీదెచ్చుకుని వారిసమ్ముఖమందు గూర్చుండెను.

శ్యామరావు: మహాలక్ష్మిగారు! మీ రెక్కడ చదువుకున్నారు?

మహాలక్ష్మి: మహారాజా కాలేజి, మైసూరు.

శ్యామరావు: మీపరిచయ భాగ్యము వలననే నీదినమును సుదినముగ భావించుచున్నాను. స్త్రీలు సర్వవిధముల నున్నతిని గాంచినగాని మనదేశ మభివృద్ధికి రాదు.

అని నుడువుచు శివరావును గాంచి యిట్లనియెను: "నీ భార్య యిచ్చట లేదా?"

శివరావు: (ముసిముసినగవున) ఈమెయే నా భార్య.

ఆమాట చెవి దూరినంతనే మహాలక్ష్మి చివ్వున లేచి నిలుచుండి తోకత్రొక్కిన త్రాచునుబోలి మండిపడుచు, శరీరముకంపింప తీక్ష్ణదృక్కులను శివరావుమీద బరపుచు ఇట్లనియెను: "నే నెవ్వనికిని భార్యనుగాను. నాకెవ్వడును భర్త లేడు."

అనుచు గదినివీడుటకు బ్రయత్నించుచుండ, శ్యామరావు డంగుబోవు, యామెనుచూచుచు, మృదుమధుర వినయస్వరమున నిట్లనియెను. "మహాలక్ష్మిగారు, క్షమింపుడు. కూర్చొండి." అని పలువిధముల బతిమాలగా, ఆమె తిరిగి కూర్చుండెను.

శివరావు: ఎందుకు ఇంతకోపము? మన స్వేచ్ఛాసాధన ఆతనికి తెలియదు. అందువలన నాతని కర్థమగు భాషలో చెప్పితిని. అందు కింతకోపమా?

మహాలక్ష్మి: కోపమా? ముందు-ఆ మనకు మేమిద్దరము స్నేహితులమని చెప్పండి. తర్వాత.

శ్యామరావు: మహాలక్ష్మిగారు, తిరిగిక్షమాపణ గోరుచున్నా. క్షమించండి. ఆతడు మీపరిచయము నాకు సరీగాచేసెను. కాని నేను పూర్వకాలపుమనిషిని. అందువలన నాకు గ్రాహ్యముకాలేదు. అపు డాతడు నాకు తెలియు భాషలో చెప్పవలసివచ్చింది. అంతే కాని యిం దెవరిదోషము లేదు. మరియొకమారు నాపక్షమునను వానిపక్షమునను మన్నింపకోరుచున్నాను—మిమ్ము శివరావు భార్యయని యన్నందుకు, విన్నందుకు.

*   *   *   *

శ్యామరావు మిక్కిలి నేర్పరి, సూక్ష్మగ్రాహి, సదయహృదయుడు, సచ్చరిత్రుడు, మితభాషి, మృదుభాషి. అందువలన నీదంపతుల మన స్తత్వములను గ్రహించి, తర్కవితర్కముల కవకాశమును గలుగనీయక లోకాభిరామాయణమునకు గడంగెను. తదనంతరము భోజనము గూడ నేవిధమగు వాగ్యుద్ధమును లేక ముగిసెను. శ్యామరావు భోజనానంతరము తాంబూలచర్వణం బొనర్చుచు "ఈసంసార మెట్లు కుదుటపడు నా" యని యోచించుచు, కారుమీద స్వగృహమున కరిగెను.

౨

ఈదంపతులిరువురును మేష్టర్లు. మహాలక్ష్మికి రు. ౭౫ జీతము. శివరావునకు రు. ౧౨౫ రూపాయల జీతము. ఇరువురును గ్రంధావలోకనమందు దిట్టలు-తర్కవితర్కములయం దత్యంతనిపుణులు. నిష్కల్మష వర్తనులు, సత్యవాదులు, స్వేచ్ఛాప్రియులు. ఋషులు గార్హస్థ్యధర్మములను నిర్వర్తించుచు మానవమండలికి లక్ష్యమై యలరారుచుండు విధముననే ఈదంపతులు గూడ మానవమండలి కాదర్శప్రాయమగు స్వేచ్ఛాజీవితమున కాలము గడుపుచుండిరి. నరనారులు సర్వస్వతంత్రులనియు, ఇం దొకరికొకరు దాసులుగారనియు, వివాహమన బంధనము దాస్యము దాస్యశృంఖలమనియు నమ్ముచుండిరి. మానవసంఘమందు పరిపూర్ణస్వేచ్ఛను స్థాపించుటకే తాము భూమండలమం దవతరించితిమని మిత్రులతోగూడ జెప్పుచుండిరి. స్వగృహమందు వీరు పులులవలె నివసించుచుండినను, వీధియం దడగిడిన అత్యంతవినయ వినమ్రతలతోగూడిన మితభాషిత్వముల మెలంగజొచ్చిరి.

ఇప్పటికి వీరివివాహమై దాదాపుగ మూడువత్సరములాయెను. ప్రతిదినమును గృహమందడుగిడగనే యిరువురును తర్కఖడ్గములను చేత ధరించి వాగ్యుద్ధమునకు గడంగుచుండిరి. ఆయుద్ధ మపుడపుడు రాత్రింబవళ్లను భేదమును బరిగణింపక అత్యంతతీవ్రముగ నడుచుచుండెను. అందువలన వా రుపవసింపవలసివచ్చిన దినములు, పూటకూటింట భుజించిన రోజులు రెండు వత్సరముల కతిశ

యించి యుండుననుట యథార్థమే. స్వేచ్ఛాయుద్ధమందు మునింగి తేలుచుండినను ఉపాధ్యాయ వృత్తికి అణుమాత్రమైనను భంగము గలుగనీయకుండిరి. క్రమము తప్పక పాఠశాలకు బోవుచుండిరి. స్వేచ్ఛామతస్థాపనమున కాదిదంపతులము కీర్తిప్రతిష్ఠలు త్వరలో తమ్మాశ్రయింపనున్నవని యువ్విళ్లూరుచుండిరి.

ఒకదినమున మహాలక్ష్మి స్వీయరచిత స్వేచ్ఛాసాధనభావగీతములను బాడుచు వీణను వాయించుచుండెను. శివరావు గదినుండి సావడిలోనికి వచ్చి యిట్లనియెను. "మహాలక్ష్మిగారు, మీరు వీణను వాయించవద్దు. భావగీతములను బాడవద్దు. నాచదువుకు భంగముకలుగుచున్నది. మన స్వేచ్ఛావాదమును రేపు గోఖలేహాలునందు విద్వన్మండలికి వినుపింపదలచితిని."

భార్య : శివరావుగారు, మీరు చేయదలచినది మహోత్కృష్టకార్యము. అది మీనిర్ణయము. కాని నేనిపుడు వీణావాద్యమున భావగీతములను బాడకతప్పదు. ఇది నానిర్ణయము. ౨౪ గంటలవరకు. ఏమయినా సరే.

భర్త : మహాలక్ష్మిగారు, నా నిర్ణయము కూడనంతయే. ౨౪ వరకు చదువుకొనకతీరదు. సంగీతమువలన నాచదువు సాగుటలేదు. మంచియవకాశమే రేపు. మన స్వేచ్ఛావాదమునకు మహోదయమే. మన నామములు భూమండలమందు చిరస్థాయినొందు సుముహూర్తము రేపేనే. కర్తవ్యము ?

భార్య : శివరావుగారు, నిజము- ముమ్మాటికి సత్యము. మనస్వేచ్ఛావాదము సిద్ధించినది. కాని నానిర్ణయమును నేను మార్చుకోను; మార్చుకొనవీలునులేదు. మీయభ్యంతరమువలన మార్చుకొంటినా నాస్వేచ్ఛ మంట కలిసినట్లే. నాతపోభంగమునకు నేనంగీకరింపను.

భర్త : మహాలక్ష్మి, నా నిర్ణయమును నేనెట్లు మార్చుకొందును ? నాస్వేచ్ఛకు సమాన ప్రతిపత్తికి భంగముకాదా ?

భార్య : శివరావ్, ఇంతయేందుకు? మీచదువు మీది. నాసంగీతము నాది. ఇందేదియు ఆపవీలు లేదు.

భర్త : చదువుసాగదే. రాజీమార్గము లేదా ?

భార్య : రాజీకుదరదనియా ? కుదరకేమి ? ౧౨ వరకు నా సంగీతము. ౧౨ తర్వాత మీచదువు.

భర్త : సరే బాగుంది. నేను ముందు చదువుకుంటా. తర్వాత నీ సంగీతము.

భార్య : కాదు కాదు. ముందు నా సంగీతము. తర్వాత మీచదువు. ఈ నిర్ణయము తిరుగదు. తిరుగుట అసంభవము. స్వేచ్ఛాభంగము.

భర్త : అంతకంటె అసంభవము. స్వేచ్ఛానాశనము.

భార్య : అయితే ?

భర్త : అయితేలేదు- గియితేలేదు.

భార్య : ఇక మనకర్తవ్యము?

భర్త : అదే యోచన.

భార్య : నేను సంగీతము మానుకుంటాను. మీరు చదువుట మానండి. మీకొరకు నేను, నా కొరకు మీరు. బాగున్నదా ?

భర్త : బాగుండ కేమి? ఇందొకరికొకరు లోబడుటలేదు. కాని యొకరి కొక రడ్డ మగుచున్నాము. అట్టిచో స్వేచ్ఛాసిద్ధి కలుగుటెట్లు ? సాధారణముగ దంపతులయందు పురుషుడు చెప్పినటుల స్త్రీయో, స్త్రీ చెప్పినటుల పురుషుడో వింటారు. అప్పుడు సంసారములు శాంతముగ నడచును. కాని అశాంతము దాస్యము. దాస్యజీవితము - ఛీ !

భార్య : యథార్థము. ఆసీనుగశాంతము నాకు సరిపడదు. నాచెవి జొరనివ్వను. స్వేచ్ఛ, స్వేచ్ఛ. నేను కోరునది స్వేచ్ఛ. నాకు కావలసినది స్వేచ్ఛాజీవితము. అదియే నాతపము; ఉపాసన; సాధన.

భర్త : మీరు చెప్పినముక్కలు అక్షరాల సత్యము. కాని ఈ అశాంతి?

భార్య : నావల్లనా ?

భర్త: నీవల్లనని నేనన్నానా? మన ఇర్వురతపమునం దవతరించిన జ్వాలాయుతమగు వివాహమే ఈ యశాంతి దీనిని మ్రింగగలమా, అమృతమును త్రావగలము.

భార్య: భేష్! నిజము. (సంతసించును)

భర్త: అయితే, ఈ రాకాసిని సంహరించు టెట్లు? నీకేదయిన మార్గము గోచరించుచున్నదా?

భార్య: ఆ. గోచరించుచున్నది. చెపుతా వినండి. మన స్నేహబంధములను తెగత్రెంచుకొని కొంతకాలము సాధన చేసిన గాని మనకు స్వేచ్ఛ సిద్ధింపదు. మనకు లభించు స్వేచ్ఛాసిద్ధియే జగద్రక్షణకు ముఖ్యపీఠమగును. అప్పుడు మననామములు జగత్తునందు చిరస్థాయియగును.

భర్త: శెబాష్. సరిగ చెప్పితివి. సంతోషము. కాని నీసలహాను నేను వినను-వినగూడదు. అట్లొనర్చుట నా స్వేచ్ఛకు భంగము. అయినను స్నేహబంధన విచ్ఛేదనతలంపు నీకు కలిగినప్పుడే నాకును కలిగినది. కావున మన ఇర్వుర స్వేచ్ఛాసిద్ధాంతమునకు భంగములేదు. ఈబంధనములను తెగత్రెంచుకొనుటకు నాకంగీకారమే.

భార్య: అంగీకారమే - బాగున్నది. ఈయశాంతిని తలదన్నినట్లే.

భర్త: మొదలెవరు? నేను—

భార్య: కాదు— నేను—

భర్త: కాదు కాదు. నేను—

భార్య: నేనొకపద్ధతిని చెపుతా వినండి. నేను తలవంచుతా - మీరుకూడా తలవంచండి. నేను మీ జంధ్యమును, మీరు నాపుస్తెలను పరస్పరము పట్టుకొని యొక్కమారు పుటుక్కున తెంచుదాం. అంతటితోడ మనపీడ వదులుతుంది. ఏమంటారు? నాయోచన సరీగ్గా యున్నదా?

భర్త: భేష్! బాగున్నది. ఈయోచన నీతోబాటు నాకును దోచినది.

భార్య: ఆలస్యమెందుకు?

భర్త: అవును. ఒక్క సెకండయినను ఆలసించుట తగదు. త-గ-దు.

ఇర్వురు తలలువంచుదురు. మంగళసూత్రమును శివరావు పట్టుకొనును. శివరావు మెడయందలి జంధ్యమును మహాలక్ష్మి పట్టుకొనును. ఇర్వురు "రెడీ-రెడీ" అని యని ఒక్కమారుగా లాగ రెండును పుటుక్కున తెగి నేలబడును.

చివ్వన ఇర్వురును తలలెత్తుదురు. "స్వేచ్ఛ, స్వేచ్ఛ" అని నుడువుచు, ఒకరు పశ్చిమముఖులును, రెండవవారు తూర్పు ముఖులుగను నడుదురు.

3

మరుసటి దినముదయముననే బయలుదేరి శివరావు బంధువులు స్నేహితులు మొదలగువారున్న కృష్ణాగోదావరీ తీరముల కరుగక బెంగుళూరు మొదలగు ప్రదేశముల కరగి ఆయాస్థలములయం దారేడు మాసములు గడపి బెంగుళూరు మెయిలునందు ఉదయము ౫-౩౦ గంటలకు సెంట్రలు స్టేషనునందు దిగెను. కాని యచ్చటనే శూన్యహృదయమున ఇటునటు చూచుచు తిరుగుచుండెను. స్నేహితులు గూడ నాతని గుర్తింపజాలకుండిరి. శుష్కించి పాలిపోయిన శరీరము, గుంటలుపడిన కండ్లు, మాసినగడ్డము, మలినవస్త్రములు గూడిన శివరావును గాంచిన వారలు పిచ్చివాడనుకొనుటయం దాశ్చర్యమేమున్నది?

శివరావు ౮ గంటలవరకు స్టేషనునందే యిటునటు తిరుగుచు బస్సునెక్కి చింతాద్రిపేట యందలి స్వగృహమును జేరెను. తలుపుదీసి లోనికరిగి సావడియందొక కుర్చీమీద కూలబడి నిట్టూర్పు విడిచెను. ఒకరిద్దరు స్నేహితులువచ్చి పలుకరించిరి. సరియగు ప్రత్యుత్తరము లేకుండెను. అందువలన వారెంతయు విచారింపజొచ్చిరి. భోజనమున కాహ్వానించిరి. కాని యాతడందుల కంగీకరింపకుండెను. వెర్రినవ్వులతో అసందర్భముగ ప్రసంగింపజొచ్చెను. "స్వేచ్ఛ, స్వేచ్ఛ, స్వేచ్ఛాసిద్ధి" యని యనుకొనుచుండెను. ఇక వారేమి చేయగలరు? అందొక స్నేహితుడు కాఫీ, ఉపమా మొదలగువానిని పంపించెను. కాని శివరావు వానిని కన్నెత్తియైనను చూడకుండెను.

కొంతవడి కా కుర్చీనుండి లేచి యింటియం దిటు నటుదిరుగుచు గదిలోనికరిగెను. అటనుండి వంటయింటి లోనికి బోయి తిరిగి మరియొకగదిలోని కరిగెను. అచట గోడకు తగిలించియున్న ఫోటోగ్రాఫుల ఫ్రేమునందు మహాలక్ష్మి ప్రతిబింబమును గాంచి "జయము. స్వేచ్ఛా వాదమునకు జయము" అని యనుచుండ ఆతని కన్నీటి బిందువులు నేల రాలెను. కాని యావిషయ మాతనికి తెలియదు. అటనుండి సావడిలోనికి వచ్చి పడకకుర్చి యందు కూలబడెను. కన్నులు మూయుచు తెరచు చుండెను

దాదాపుగ పండ్రెండుగంటల వేళ ఘోషా ఆస్పత్రినుండి జవానువచ్చి 'శివరావుగారు' అని పిలిచెను. లోనికరిగి యొకయుత్తరమును ఆతనిచేతికిచ్చి చేతులు కట్టుకొని బహుమతికొరకు వేచియుండెను. ఆయుత్తరమును చదువుకొనినంతనే శివరావుమోము ఒకింత విప్పారెను. జవానున కొక రూప్యమిచ్చి తిరిగియుత్తరమును చదువుకొనెను. ఆయుత్తరమును చేతిపెట్టెయందు దుబెట్టి గుమ్మముకడకువచ్చి తిరిగి రివ్వున మరియొక కుర్చీమీద గూర్చుండును. చేపెట్టెనుండి యాయుత్తరమును దీసికొని తిరిగిచదువుకొనెను. దానిని భద్రముగ కోటుజేబునం దిడి, అతిత్వరితముగ స్నానమొనర్చి బీరువాయందలి బట్టలనుదీసికొని వానినిధరించి వీధివాకిలి కడవరకు జని తిరిగివచ్చి కూర్చుండెను. ఒకటిరెండు నిముసములు యోచించి యేవిధమగు నిర్ణయమునకు రాజాలకుండెను. ఒకింతవడికి అటనుండిలేచి గదిలోని కరిగి బీరువానుదెరచి యందొక రుమాలునుదీసి జేబునందు బెట్టుకొనెను. ఆతని శరీరమందంతటను ఏదియో యపూర్వశక్తి వ్యాపించెను; నేత్రములు వారిపూరితములాయెను. అప్పుడాతని హృదయాగ్ని యొకింత యుపశమిల్లెను. కాని పాదములు తూలిపోవుచుండుటవలన కూలబడెను.

ఒక్కనిముసము గూర్చుండి చివ్వనలేచి వీథిలోని కరిగి రిక్షామీద నెక్కి హాస్పిటలునకు బయలుదేరెను. మార్గమందు గాన్పించిన మిత్రులప్రశ్నలకు ప్రత్యుత్తర మీయక రిక్షా లాగువానిని త్వరితముగ బొమ్మని తొందరించుచు హాస్పిటలును జేరెను. లోనికరిగి జనరలువార్డునందు ఇటునటు తిరిగెను. మేడపైకి బోయెను. అచ్చటనుండి క్రిందికివచ్చి స్పెషలు వార్డులలోనికి బోవుచుండ మహాలక్ష్మిని గాంచెను. ఆమె చేసంజ్ఞలతో శివరావును ఆహ్వానింపగా శివరావు గబగబ ఆ గదిలోని కరిగెను.

అచ్చట ఇనుపమంచము మీద పరచిన తెల్లని ప్రక్కమధ్య శయనించి దైవదృష్టిని మరపింపజేయు చూపుల రెప్పవాల్చక చూచుచున్న ఇరువదియైదు దినముల శిశువును గాంచెను. మంచమును సమీపించెను. తదేకదృష్టిని బాలుని చూడజొచ్చెను. అనిర్వచనీయమగు ఆకర్షణవలన నాతనిదృక్కులు బాలుని దివ్యదృష్టియందు మిళితమాయెను. రోమాంచితుడై ఆనందాశ్రువులు జొటజొట రాలుచుండ తలవంచి కుడిహస్తమున బాలుని బుగ్గలను స్పృశింప, ఆశిశువుబోసినోటినుండి పండువెన్నెలలు బహిర్గతమాయెను. సునిర్మలముకురమందు- సుస్వచ్ఛతటాకజలములయందు- కృష్ణాప్రవంతియలలయందు- స్వీయరూపరేఖావిలాసములను దిలకించినటుల, ఆశయనమందలి శిశువునందు స్వీయరూపమును నిశ్చంచలచిత్తమున సునిర్మలహృదయమున చూచుచుండ తనివిదీర గ్రోలుచుండ, ఆసుకోమలరూపమాధురిని నేత్రయుగళమున జుర్రుచుండ మహాలక్ష్మి యాచూపున చూపు గలిపి అనిర్వచనీయమగు ఆనందము ననుభవించుచుండ, వారిర్వురి నేత్రయుగళమునుండి ఆనందాశ్రువులు బాలునిపైద వాలజొచ్చెను. అప్పుడామె అప్రయత్నముగ, యోచనారహితముగ బాలునెత్తి భర్తకరకమలములయందిడెను. శివరావు బాలుని ముద్దాడజొచ్చెను.

మహాలక్ష్మి ప్రక్కసర్ది పొత్తిలిగుడ్డలను సరిగలాగి భర్తచేతియందలి శిశువును పడుకొనబెట్టెను. అప్పుడు బాలుడు చేతులుకాళ్లు కదలించుచు శరచ్చంద్రచంద్రికల ధిక్కరించుచిరునగవులు బరపుచుండ శివరావు బాలుని శిరముమీద చేయిడి "స్వతంత్రరావు" అని ముమ్మారు పిలచి తలయెత్తెను. భార్యను చూచెను. ఒకరి దృష్టియందు మరియొకరిదృష్టిని విలీనమొనర్చుకొనిరి. ఇర్వురును బాలునిచూచుచు నొక్కస్వరమున "స్వతంత్ర

రావు" అని పిలచుచు చిరునగవుల నాబాలుని యాశీర్వదించిరి; దీర్ఘాయువును గోరిరి.

అప్పుడు మహాలక్ష్మి భర్తపాదములమీద వ్రాలి యిట్లనియెను. "నాథా! క్షమింపుడు" అని యనుచుండ శివరా వామెను లేవదీసి కూర్చుండబెట్టి చేలాంచలమున నామెకన్నీరు దుడిచి "ప్రేయసీ, నీయందేమి లోపమున్నది? క్షమించుటకు నీవు నిర్దోషివి. నిష్కల్మషహృదయవు. నిర్దుష్టచరిత్రవు. నేనో క్షమార్హుడను. క్షమించుము. నేను కుతర్కజాలమందు బంధింపబడితిని. నిన్ను బంధించితిని. అందువలన పలుబాములకు లోనైతిని. నూతన మతస్థాపనమున కవతరించితినను నాయజ్ఞానము-తర్కభ్రమ - విచిత్రతృష్ణ - అసహనము - ఈర్ష్య మొదలగువానివలన దగ్ధమగుచు, నిన్ను దగ్ధమొనర్చితిని. వేయివృశ్చికదంశనములవలన బొందుబాధను అనుభవించితిని. నేటికి జ్ఞానమూర్తియగు భగవానునకు హృదయమర్పింపగలిగితిని. ఆంధ్రుల జీవనము, జీవనాధారుడగు ఆత్మారాముడు స్వతంత్రరావును సర్వవిధముల సంరక్షించుగాత." అని యామెహస్తద్వయమునుబట్టుకొనెను.

మహాలక్ష్మి చేతులు జోడించుకొని గద్గదస్వరమున నిట్లనియెను. "నాథా! నాబుద్ధి నిరంతరము కీటకముబోలె గ్రంథములయందు దిరుగుచుండెను. లోకజ్ఞానము కలుగవలయునని నాతలిదండ్రు లొనర్చిన ప్రయత్నములు నన్నుకల్పితజగత్తు, కుతర్కజాలమునుండి తప్పింపజాలకుండెను. విద్యాంసురాలనను అహంకారము మిన్నుముట్ట జొచ్చెను. అతిభయము - సిగ్గు - అత్యంత ధైర్యము - నిరుపమానమగు పిరికితనము - అశక్తత - మొదలగువానియందు దగుల్కొని మీకత్యంత దుఃఖమును గలిగించితిని. నే నధఃపతితనైతిని. త్రిలోకశరణ్యము, త్రిలోకవరేణ్యము అగు గృహస్థాశ్రమరూపమును, పవిత్రతను గ్రహింపలేకుంటిని. గృహస్థాశ్రమమే మానవమండలికి స్వభావసిద్ధమగు ఆశ్రమమనిగాని, రక్షణాభివృద్ధులకు ఆధారమనిగాని యెరుంగజాలక మిమ్మనేకవిధముల బాధించితిని. నేనత్యంత తీవ్రమనోవ్యథకు గురియైతిని. క్షమింపుడు." అనుచు కాళ్లమీద బడబోవు మహాలక్ష్మిని గూర్చుండబెట్టి శివరావు ఇట్లనియెను. "మన మిర్వురము సర్వవిషయముల సమానులము. ఇందెచ్చుతగ్గులుండినచో ఇంతటి దుఃఖము ననుభవించియుండము. మనమన స్తత్వములు - కుతర్కవీచికలుగూడ సమానములు. నాయుపదేశములవలన అనేకమందికొంపలు కూలినవి. అంతియే కాదు. ఒకరిద్ద రాత్మహత్య యొనర్చుకొనిరి. ఆవిషయములు నన్ను నిరంతరము దగ్ధమొనర్చుచున్నవి. అట్టి నేను క్షమార్హుడను. కాని నీవుకాదు. క్షమించు. త్రికరణశుద్ధిగ క్షమించు మహాలక్ష్మీ! మనల నావరించిన యజ్ఞానాంధతమోరాశియం దీ బాలచంద్రోదయమైనది. వెంటనే జ్ఞానము కలిగినది. తమస్సు పటాపంచలైనది. నిన్ను నేను క్షమించుచున్నాను. హృదయపూర్వకముగ నన్నుక్షమించుము." అనుచుండ నామె సుందరముఖారవిందము విప్పారెను. చిరునగవుల శివరావును మంచి లేవనెత్తెను.

అంత నొకపైపున ముసిముసి నగవుల చూచుచు నిలుచుండిన శ్యామరావును, సుశాంతభావమున గూర్చుండియుండిన నర్సును గాంచి శివరావు ఒకింత సిగ్గుపడెను. 'ఎపుడువచ్చితివి' అని యడుగ శ్యామరావు "నీవు నన్నుచూడలేదు. నీకంటె ముందుగ నేనిటకు వచ్చితిని." అని ప్రత్యుత్తరమొసగి జంధ్యముల జతను మహాలక్ష్మిచేతి కొసగెను. ఆమె యాజంధ్యములకు పసుపువ్రాయుచుండ, శివరావు చేతిరుమాలును శ్యామరావుకిచ్చెను. అందు ముడివైచియుండిన మంగళసూత్రమునుగాంచి పరమానందభరితుడై శ్యామరావు తిరిగి శివరావుచేతి కొసగెను. శివరావు దానిని మహాలక్ష్మికంఠమున గట్టెను. మహాలక్ష్మినేత్రములు విప్పారమన ముప్పొంగ శివరావుమెడయందు జంధ్యమును తగిలించెను.

అంత వారిర్వురును చిరునగవులు వెలిగ్రక్కుచు ఆశీర్వాద దృక్కుల చూచుచున్న శ్యామరావుకు నమస్కరించిరి. ఆతడు వీరిర్వురను దీవించెను.

భర్తచేయిబట్టుకొని మహాలక్ష్మి యిట్లనియెను. "ఈతడు పురుషోత్తముడు. నన్ను సర్వవిధముల గాపాడిన యుదారహృదయుడు. పరమపవిత్రుడగు నీసోదరుని ఋణమును నే నీజన్మయందు దీర్చుకొనజాలను. దీర్చుకొనుట అసంభవము. ఈమెను నర్సుగ భావింపకుడు. నే నటుల భావించను. ఈమె నాతల్లి. శ్యామరావు నాతండ్రి"

అంత శ్యామరావుకారు వచ్చెను. దానియందు నల్వురునుగూర్చుండి శ్యామరావుఇంటి కరిగిరి.

"ఆత్మావై పుత్రనామాసి."